ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపండి

- కమ్యూనిస్టులుంటేనే ప్రజాస్వామ్యం బతుకుతుంది
- తెలంగాణలో కూడా సీజ్ ఫైర్ ప్రకటించాలి
- మావోయిస్టులతో కేంద్రం బేషరతుగా చర్చలు జరపాలి
- ఆర్థిక అసమానతలున్నంత కాలం ఉద్యమాలుంటాయి
- పీస్ డైలాగ్ కమిటీ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"ఆర్థిక అసమానతలున్నంత కాలం ఉద్యమాలుంటాయి. కమ్యునిస్టులుంటేనే ప్రజాస్వామ్యం బతుకుతుంది. అపరేషన్ కగార్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలి. సీజ్‌ఫైర్ ప్రకటించి మావోయిస్టులతో బేషరతుగా చర్చలు జరపాలి" అని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'పీస్ డైలాగ్ కమిటీ' ఆధ్వర్యంలో కగార్ ఆపరేషన్, శాంతిచర్చల అంశంపై ఆ సంఘం సభ్యులు అన్వర్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ చత్తీస్‌గఢ్ అడవుల్లో కగార్ ఆపరేషన్ పేరిట అమాయక గిరిజనులను కాల్చి చంపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అటవీ ప్రాంతం నుంచి ఆదివాసీలను, నక్సలైట్లను ఏరివేసి, అక్కడున్న ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పగించేందుకే మోడీ సర్కార్ ఈ మారణహోమానికి పాల్పడుతోందని విమర్శించారు. 2026 కల్లా దేశంలో మావోలను ఏరివేస్తామని కేంద్రహోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటించడాన్ని ఆయన ఎద్దేవా చేశారు. ఆర్థిక, సామాజిక అసమానతలున్నంత వరకు సమాజంలో ఉద్యమాలు పుట్టుకొస్తూనే ఉంటాయని స్పష్టం చేశారు. పహల్గాం దాడికి పాల్పడ్డ ఉగ్రవాద దాయాది దేశమైన పాకిస్తాన్‌తో చర్చలు జరిపిన కేంద్రం, దేశ పౌరులైన మావోలతో ఎందుకు చర్చలు జరపడం లేదని ప్రశ్నించారు. ఆపరేషన్ కగార్ పేరిట చేస్తున్న హత్యాకాండను ఆపి మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. పీస్ డైలాగ్ కమిటీ అధ్యక్షులు జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ వివిధ ప్రజా సంఘాలు, పార్టీల అభిప్రాయాల మేరకు ప్రజా ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఆపరేషన్ కగార్‌ను ఆపాలని, మావోయిస్టులతో వెంటనే చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ సోమవారం నుంచి ఈ నెల ఆరు వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడుతామని వివరించారు. టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ కమ్యునిస్టులుంటేనే దేశంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం బతుకుందని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ హింసకు వ్యతిరేకమనీ, గతంలో తమ సర్కార్ హయాంలోనే నక్సల్స్‌తో చర్చలు జరిపామని గుర్తు చేశారు. మావోలు స్వయంగా చర్చలకు పిలుపునిస్తే, వారి ప్రతిపాదనలను పక్కన పెట్టి, నక్సల్స్‌తో పాటు అమాయక గిరిజనులను కేంద్రం వెంటాడి చంపుతోందని విమర్శించారు. మోడీ సర్కార్ ఫాసిస్టు పద్ధతుల్లో హింసద్వారానే అన్నింటిని గెలుస్తామనే భ్రమల్లో ఉందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ అధిష్టానంతో మాట్లాడి రాష్ట్రంలో సీజ్ ఫైర్‌పై తమ పార్టీ అభిప్రాయం చెబుతామని అన్నారు. ఎన్‌కౌంటర్ల పేరిట మావోయిస్టులను, గిరిజనులను చంపడం రాజ్యాంగానికి వ్యతిరేకమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అన్నారు. ఈ హింసాకాండలో ఇరు వైపుల నుంచి పేద, మధ్యతరగతి ప్రజలే చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే కాల్పుల విరమణను ప్రకటించి మావోలతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్యపద్మ మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరిట కేంద్రంలోని మోడీ సర్కార్ హింసాకాండకు పాల్పడుతోందని విమర్శించారు. శాంతి చర్చల కోసం మావోలు చేసిన ప్రతిపాదనను ఎందుకు తిరస్కరించారో చెప్పాలని డిమాండ్ చేశారు. విస్తృత ప్రజా ఉద్యమాల ద్వారా అన్ని పార్టీలు ఏకమై మావోలతో చర్చలకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని అభిప్రాయపడ్డారు. తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ నక్సల్స్ ఏరివేత పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రజలపై యుద్ధం చేస్తోందని ఆరోపించారు. బిజెపి యేతర ఎంపీలు, ఇతర ప్రజా ప్రతినిధులను కలిసి మోడీ సర్కార్‌పై ఒత్తిడి తేవాలని అభిప్రాయపడ్డారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో వివిధ సంఘాలతో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ అధ్వర్యంలో ఇప్పటికే వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలను కలిసి మద్దతు కోరామని తెలిపారు. పాలకులు, పెట్టుబడి దారుల చేతుల్లో కీలుబొమ్మలుగా ఉన్నారనీ, వారిని కాదని నిర్ణయాలు తీసుకునే పరిస్థితి ఈ దేశంలో లేదని అన్నారు.. న్యూడెమోక్రసీ నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య మాట్లాడుతూ ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపి మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. 14న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్‌వద్ద మహాధర్నా చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాస్వామ్య వాదులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలకు చెందిన కందిమల్ల ప్రతాపరెడ్డి, హన్మేష్, గోపీనాథ్, గడ్డం లక్ష్మన్, జీవన్‌కుమార్, నాగిరెడ్డి, అనంతరెడ్డి, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఐదున రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

- కీలకాంశాలపై చర్చించనున్న క్యాబినెట్
- పూర్తిస్థాయి పరిశీలన తర్వాతే 'యువ వికాసం' జాబితా
- మంత్రివర్గంలో చర్చించాకే ఉద్యోగుల సమస్యలపై నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర మంత్రివర్గ సమావేశాన్ని ఈనెల ఐదున నిర్వహించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఆదివారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆయన మంత్రులతో భేటీ అయ్యారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు, ఇందిరమ్మ ఇండ్లు, రెవెన్యూ సదస్సులు, వాన కాలం పంటల సాగు సన్నద్ధత, రాజీవ్ యువ వికాసం తదితరాంశాలపై మంత్రులు ఈ సందర్భంగా సీఎంకు నివేదిక సమర్పించారు. మే 29, 30 తేదీల్లో జిల్లాల్లో పర్యటించిన మంత్రులు ఈ నాలుగు అంశాలపై అధికారులతో సమీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రావిర్భావ వేడుకల ఏర్పాట్లతోపాటు ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల తుది జాబితాలు, రెవెన్యూ సదస్సుల నిర్వహణ, వాటి ఏర్పాట్లకు సంబంధించి జిల్లాల వారీగా తయారు చేసిన నివేదికలపై మంత్రులు సీఎంకు వివరించారు. రాజీవ్ యువ వికాసం పథకానికి ఊహించిన దానికంటే ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని వారు తెలిపారు. అనర్హులకు ఈ పథకం అందకుండా చూడాలంటూ పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. అధిక సంఖ్యలో వచ్చిన దరఖాస్తుల స్క్రీనింగ్ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో పూర్తి స్థాయి పరిశీలన తరువాతే అర్హుల జాబితాలను ప్రకటించాలని, మరింత లోతుగా విశ్లేషించి లబ్ధిదారులను గుర్తించాలని సిఎం ఈ సందర్భంగా నిర్ణయించారు. అర్హులకే ఈ పథకం దక్కేలా చూడాలని ఆయన నొక్కిచెప్పారు. ఈ అంశంపై క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఉద్యోగుల సమస్యలపై నియమించిన కమిటీ రిపోర్టును అధికారులు... ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఇప్పటికే సమర్పించారు. ఆ నివేదికలోని అంశాలను ఆయన సీఎంకు, మంత్రులకు వివరించారు. దీనిపై కూడా మంత్రివర్గంలో చర్చించి, నిర్ణయం తీసుకోనున్నారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నందుకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని మంత్రులు ఈ సందర్భంగా అభినందించారు. సిఎంతో మందకృష్ణ భేటీ ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ ఆదివారం జూబ్లిహిల్స్‌లోని నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. పద్మశ్రీ అవార్డు అందుకున్న సందర్భంగా మందకృష్ణను సిఎం అభినందించారు. భారత మాజీ రాష్ట్రపతి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి వర్ధంతి సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి ఆ మహనీయుని చిత్రపటానికి ఆదివారం జూబ్లిహిల్స్ నివాసంలో పుష్పాంజలి ఘటించారు.

మావోయిస్టులు చర్చలంటుంటే.. కాల్చి చంపుతానని కేంద్రం అంటోంది

- పొఫెసర్ హరగోపాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓ పక్క మావోయిస్టులు చర్చలు అంటుంటే.. వారిని చంపి తీరుతా అని మరో పక్క కేంద్ర ప్రభుత్వం మాట్లాడడం ఆశ్చర్యం కలిగిస్తోందని ప్రొఫెసర్ జి హరగోపాల్ అన్నారు. ఆదివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పూర్వ విద్యార్థి వేదిక నాయకులు ఎన్.రవి ఆధ్వర్యంలో ఆర్ఎస్‌యు వ్యవస్థాపక సభ్యులు, మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు స్మృతిలో "సాయుధ విప్లవ పోరాటం-శాంతి చర్చలు" సదస్సు నిర్వహించారు. ముందుగా ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన నంబాళ్ల కేశవరావుతో సహా ఇతరులందరికీ నివాళులర్పించారు. అనంతరం ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. కొంతకాలంగా పాలకులు అనుసరిస్తున్న విధానాలతో దేశం ఒక విచిత్రమైన సంక్షోభంలోకి పడిపోయిందన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు, ప్రజా సంఘాలు, హక్కుల సంఘాలు.. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలనికోరుతుంటే..ప్రభుత్వం అణిచివేతను నమ్ముకుంటుందని తెలిపారు. దండకారణ్యం నెత్తురోడు తోందని, విప్లవోద్యమం అణిచివేతే లక్ష్యంగా సాగుతున్న ఆపరేషన్ కగార్ ఆదివాసీ హననానికి కారణం అవుతున్నదని అన్నారు. కార్పొరేట్ దోపిడీని వ్యతిరేకిస్తున్న ఆదివాసీ సమాజానికి అండగా ఉన్న విప్లవోద్యమాన్ని నిర్మూలించడం ద్వారానే పెట్టుబడిదారుల ప్రయోజనాలు కాపాడగలమన్న భావనతో మోడీ ప్రభుత్వం దేశ ప్రజలపై యుద్ధం చేస్తున్నదని చెప్పారు. ఈ మారణ హోమానికి అర్థవంతమైన పరిష్కారం వెతకాలనే ఉద్దేశంతో శాంతి చర్చలు జరపాలని ప్రజాస్వామిక వాదులు ప్రతిపాదనను ముందుకు తెచ్చారని తెలిపారు. దేశవ్యాప్తంగా దీనిపై చర్చ జరుగుతున్నా ఖాతరు చేయని కేంద్ర ప్రభుత్వం యుద్ధ బీభత్సాన్ని సృష్టిస్తోందన్నారు.

వీక్షణం సంపాదకులు వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఒకవైపు విప్లవ పార్టీ చర్చలకు సిద్ధమని, కాల్పుల విరమణ పాటిస్తామని ప్రకటించినా ప్రభుత్వం మాత్రం తుపాకీతోనే పరిష్కరిస్తామనడం అమానవీయం అన్నారు. ఇది మావోయిస్టుల సమస్య కాదని, ఆదివాసులదీ, ప్రజలదని తెలిపారు. అటవీ ప్రాంతాల్లో సంపదను.. కార్పొరేట్లకు కట్టబెట్టడం కోసం ఆదివాసులకు అండగా నిలబడుతున్న మావోయిస్టులను నిర్మూలించడమే లక్ష్యంగా కేంద్రం ప్రకటించడం రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాయడమేనని అన్నారు. భారత్ బచావో నాయకులు డాక్టర్ గోపీనాథ్ మాట్లాడుతూ.. ఆపరేషన్ కగార్ పేరుతో జరుగుతున్న విధ్వంసాన్ని అడ్డుకునేందుకు మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం, చత్తీస్‌గఢ్ ప్రభుత్వం చర్చలు జరపాలని కోరారు. లక్షలాదిమంది భద్రతా బలగాలను మోహరించి వాయుసేనకు చెందిన హెలికాప్టర్లు డ్రోన్లు, బాంబులతో ఆదివాసీలపై అంతర్యుద్ధాన్ని చేస్తున్నాయని, అంతర్యుద్ధం ప్రకటిస్తే అంతర్జాతీయ న్యాయ సూత్రాలను పాటించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎంఎఫ్ గోపినాథ్, విరసం నాయకులు పాణి, సీఎల్‌సీ నాయకులు లక్ష్మణ్‌తో పాటు ఆత్రం భుజంగరావు, బురం అభినవ్, ప్రజా సంఘాల నాయకులు, విప్లవ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్

- రిజిస్ట్రేషన్ సేవల్లో ఎఐ వినియోగం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రిజిస్ట్రేషన్ శాఖలో చేపట్టిన స్లాట్ బుకింగ్ విధానాన్ని జూన్ రెండు నుంచి రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేస్తున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఆదివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో స్లాట్ బుకింగ్ విధానంపై రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రెండు విడతల్లో 47 చోట్ల అమలు చేసిన విధానం విజయవంతమైందనీ, 94 శాతం మంది ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారని పేర్కొన్నారు. మొదటి దశలో 22 సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో ఏప్రిల్ 10 నుంచి ఇప్పటివరకు 30,592 డాక్యుమెంట్లు, రెండో దశలో 25 సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో మే 12 నుంచి ఇప్పటివరకు 14,099 డాక్యుమెంట్లు మొత్తం 45,191 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరిగాయని అన్నారు. స్లాట్ బుకింగ్ వల్ల మూడు వేల డాక్యుమెంట్లు ఎక్కువగా రిజిస్ట్రేషన్ జరిగాయని తెలిపారు. కృత్రిమ మేధ (ఎఐ) అనుసంధానంతో కూడిన చాట్‌బాట్-మేధ 8247623578 వాట్సాప్ నెంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని మంత్రి వెల్లడించారు. ఈ నూతన ప్రక్రియ వల్ల రిజిస్ట్రేషన్ చేసుకునే వారికి ఆఫీస్ లొకేషన్, స్లాట్ బుకింగ్ ఖాళీల వివరాలు, గిఫ్ట్, సేల్ డీడ్‌లపై ఛార్జీలు, మార్కెట్ ధరలు తదితర సమాచారం తెలుసుకోవచ్చని చెప్పారు. స్లాట్‌బుకింగ్ విధానం దృష్ట్యా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యవస్థీకరిస్తున్నామనీ, పని భారం అధికంగా ఉన్న తొమ్మిది చోట్ల అదనపు సబ్ రిజిస్ట్రార్‌తోపాటు సిబ్బందిని నియమించామని తెలిపారు. స్లాట్ బుకింగ్‌తోపాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయడంలో భాగంగా ఆధార్-ఈ సంతకం ప్రవేశపెడుతున్నామని చెప్పారు. ముందుగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, ఖమ్మం జిల్లా కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రయోగాత్మక అమలు చేస్తున్నామనీ, త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని వెల్లడించారు.

హైదరాబాద్ అనుభవం మరపురానిది

అవకాశం వస్తే మళ్లీ వస్తా • మిస్ వరల్డ్ సుచాత చువాంగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ అనుభవం మరుపు రానిదని మిస్ వరల్డ్-2025 విజేత ఒపల్ సుచాత చువాంగ్‌శ్రీ (థాయిలాండ్) అన్నారు. హైదరాబాద్‌లోని ట్రిడెంట్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. నగర ప్రజలు ఎంతో స్నేహపూర్వకంగా ఉంటారనీ, ఇంత అద్భుతమైన అనుభవం పొందడం జీవితంలో మధుర జ్ఞాపకమని అన్నారు. "థాయిలాండ్‌కు ఇది మొట్టమొదటి మిస్ వరల్డ్ క్రౌన్. దీన్ని గెల్చుకోవడం గర్వకారణమే కాదు.. పెద్ద బాధ్యతగా భావిస్తున్నాను. నా దేశ ప్రజలతోపాటు, హైదరాబాద్‌లో మా కోసం పనిచేసిన ప్రతీ ఒక్కరికి రుణపడి ఉంటాను," అని ఆమె చెప్పారు. క్రౌన్ ప్రకటంచిన క్షణం ఎంతో భావోద్వేగానికి లోనయ్యానని తెలిపారు. లక్ష్యం నిర్ధారించుకొని కష్టపడితే తప్పకుండా విజయం సాధిస్తారని అభిప్రాయపడ్డారు. మూడేళ్లుగా థాయిలాండ్‌లో బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహనపై పని చేస్తున్నాని తెలిపారు. ఇకపై తన పర్పస్ ప్రాజెక్ట్‌తోపాటు ఇతర కంటెస్టెంట్స్ పర్పస్ ప్రాజెక్ట్‌లపై మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్‌తో కలిసి పని చేస్తానని ప్రకటించారు. తన సేవా కార్యక్రమాలను ప్రపంచ వ్యాప్తంగా విస్తరించనున్నట్టు సుచాత తెలిపారు. మిస్ వరల్డ్, థాయిలాండ్ తరపున రాష్ట్ర ప్రభుత్వ ఆతిథ్యానికి ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మిస్ వరల్డ్ 2025 పోటీలు విజయవంతంగా పూర్తవడంతో పోటీదారులు ఇంటి బాట పట్టారు. ఇండియాతో సహా 67 దేశాలకు చెందిన వారు తమ తమ దేశాలకు వెళ్లిపోయారు.

ప్రభుత్వ బడులను కాపాడుకుందాం

- మన ఊరి పిల్లలను మన ఊరి ప్రభుత్వ బడిలో చేర్పిద్దాం
- నల్లగొండలో విద్యార్థుల నమోదు ప్రచార జాతాలో చావ రవి

జాతాలో మాట్లాడుతున్న చావ రవి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను పొందాలని, ప్రభుత్వ బడులను కాపాడుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి పిలుపునిచ్చారు. ఆదివారం నల్లగొండ పట్టణం లోని ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు పెంపుదల కొరకు టిఎస్‌యుటిఎఫ్ నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రచారజాతాను చావ రవి.. క్లాక్‌టవర్ సెంటర్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉన్నారని, విశాలమైన తరగతి గదులు, ఆటస్థలం ఉన్నాయన్నారు. తల్లిదండ్రులందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను ఉచితంగా పొందాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వబడులను కాపాడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైన ఉన్నదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, వర్క్ బుక్కులు, ఏకరూప దుస్తులు ఉచితంగా అందించబడుతున్నాయని, నాణ్యమైన మధ్యాహ్నభోజనం, వారానికి మూడుసార్లు కోడిగుడ్డు, రాగిజావ అందిస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను ఆదరించి పిల్లలను చేర్పించి, ఫీజుల భారం లేని ఉచిత విద్య పొందాలన్నారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి ప్రభుత్వ పాఠశాలలు దోహదపడుతా యని తెలిపారు. ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధన, ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని, అత్యున్నత విద్యార్హతలు కలిగిన టీచర్లు ఉంటారని తల్లిదండ్రులకు వివరిస్తామని తెలిపారు. తల్లిదండ్రుల ఆశను ప్రయివేట్ విద్యా వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారని, చదువుల నాణ్యతలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల మధ్య పెద్దగా వ్యత్యాసం లేదని పలు సర్వేలు వెల్లడిస్తున్నాయని అన్నారు. కుటుంబ సంపాదనలో సగానికి పైగా పిల్లల చదువుల కోసమే ఖర్చు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు.

ప్రభుత్వ బడి మూతపడితే సమాజానికి నష్టం అని, మన ఊరు - మనబడి, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా మౌలిక వసతుల కల్పన మెరుగయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బక్కా శ్రీనివాస్‌చారి, పెరుమాళ్ల వెంకటేశం, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎడ్ల సైదులు, జి అరుణ, సరళ, వి జగదీష్‌బాబు, ఎస్‌ఒ కత్తుల రవీందర్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు బద్రీనాథ్, మంగ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల సెక్రటరీ అలుగు వర్షిణిని వెంటనే సస్పెండ్ చేయాలి

- స్కైలాబ్ బాబు డిమాండ్

సమావేశంలో మాట్లాడుతున్న సైలాబ్ బాబు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బాత్‌రూమ్‌లు కడగాలని, తరగతి గదులు, హాస్టల్ రూములు శుభ్రం చేసుకోవాలంటూ దళిత విద్యార్థులను కించపరుస్తూ మాట్లాడిన గురుకులాల సెక్రటరీ అలుగు వర్షిణిని తక్షణమే సస్పెండ్ చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం నిజామాబాద్ సిఐటియు కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గురుకులాల సెక్రటరీ అలుగు వర్షిణి దళితుల్ని అవమానపరిచిన తీరు చాలా అభ్యంతరకరమన్నారు. దళిత పిల్లలు వారు ఏమైనా రాజ సింహాసనం నుంచి వచ్చారా.. వారేమైనా రాజులా అన్నట్టు వెటకారంగా మాట్లాడటం విద్యార్థులను అవమానించడమేనని అన్నారు. అలుగు వర్షిణి తమ ఆఫీసు బాత్‌రూమ్‌లను వారే కడుక్కుంటున్నారా, ఆఫీసు రూములను వారే ఊడ్చుకుంటున్నారా.. అని ప్రశ్నించారు. ఒక ఐఎఎస్ అధికారి విద్యార్థిలోకాన్ని అవమానించడం శోచనీయమన్నారు. ఈ అవమానాలతో వారి చదువులు ఎలా సాగాలని ప్రశ్నించారు. ఈ విషయంపై తక్షణమే ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలన్నారు. దేశంలో భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటూ రాజ్యాంగం వల్ల ఈ రోజు అట్టడుగు బడుగు, బలహీన వర్గాలు చదువులు, ఆటలు, ఉద్యోగాల్లో రాణిస్తుంటే అది చూసి ఓర్వలేకనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. మంత్రివర్గంలో ఉన్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, నేతలు వివేక్ వెంకటస్వామి లాంటి వారు చొరవ తీసుకుని ఆమెను సస్పెండ్ చేయించి గురుకులాలను కాపాడాలని అన్నారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కొండ గంగాధర్, జిల్లా ఉపాధ్యక్షులు సలవాల నర్సయ్య, జిల్లా నాయకులు జంగం గంగాధర్, సంపత్, రాజు, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి

పాలకులు మారినా.. మారని విధానాలు

- హామీలను అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలి : జూలకంటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాలకులు మారినా పరిపాలనా విధానాలు మాత్రం మారడం లేదని, నేటికీ రాష్ట్ర అభివృద్ధి జరగడం లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని స్థానిక సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల పట్ల వివక్ష చూపుతోందని, దీనివల్ల ప్రభుత్వంలో ప్రతిపక్ష పార్టీలు ఉన్న రాష్ట్రాలకు నిధుల కేటాయింపుల సహకారం అందించడం లేదని విమర్శించారు. విభజన హామీలు కూడా అమలు కావడంలేదని విమర్శించారు. గత ప్రభుత్వం అవలంబించిన విధానాలే ఇప్పటి ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. దాంతో పేద ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం అందడంలేదన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రభుత్వం చిత్తశుద్ధి నిరూపించుకోవాలని తెలిపారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాలను నిర్వీర్యం చేస్తున్నదని, ప్రయివేట్ రంగాన్నే ప్రోత్సహిస్తున్నదని అన్నారు. అతిపెద్ద వ్యాపార రంగంగా విద్యా, వైద్య రంగాలను మార్చారని విమర్శించారు. స్థానికసంస్థల ఎన్నికలు జరగకపోవడంతో గ్రామ పంచాయతీలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయని, వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. రాష్ట్రంలో కోటీ 20 లక్షల మంది అసంఘటిత రంగ కార్మికులు ఉన్నారని, వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ ప్రభుత్వం ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని, లిఫ్టుల ఇరిగేషన్ నిర్వహణ బాధ్యత చేపట్టడం లేదని, కట్టిన ప్రాజెక్టులు కూలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, దాని ఫలితంగా ప్రజల తీవ్ర అసంతృప్తిలో ఉన్నారని చెప్పారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, వన్‌టౌన్, టూ టౌన్ కార్యదర్శులు డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి, భావండ్లపాండు, జిల్లా నాయకులు పాదూరి శశిధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు పారేపల్లి సత్యనారాయణరావు, లింగయ్య, రామారావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తన పంపిణీ

- నేడు లాంఛనంగా ప్రారంభించనున్న మంత్రి తుమ్మల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాలను పురస్కరించుకుని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో 'గ్రామ గ్రామానికి నాణ్యమైన విత్తన పంపిణీ' కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. సోమవారం ఈ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లాంఛనంగా ప్రారంభించనున్నారు. వివిధ జిల్లాల్లో జరిగే రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆయా జిల్లాల మంత్రులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయ అధికారులతో కలిసి ఎంపిక చేసిన అభ్యుదయ రైతులకు ఐదు ప్రధాన పంటలకు సంబంధించిన (వరి, కంది, పెసర, మినుము మరియు జొన్న) నాణ్యమైన విత్తనాల కిట్లను లాంఛనంగా పంపిణీ చేస్తారు. ఎంపిక చేసిన మిగతా అభ్యుదయ రైతులకు జూన్ 3న ఆయా గ్రామాలకు సంబంధించిన రైతు వేదికల నుంచి స్థానిక ఎఇఒ, ఎఒలు, వ్యవసాయ విశ్వవిద్యాలయ నోడల్ అధికారుల పర్యవేక్షణలో ఈ విత్తన కిట్లను పంపిణీ చేస్తారు. ఈ కార్యక్రమం కింద సుమారు నాలుగువేల మంది అభ్యుదయ రైతులకు నాణ్యమైన విత్తన కిట్లను 11వేల గ్రామాల్లో పంపిణీ చేయనున్నారు.

గ్రామీణ విత్తన స్వయం సంవృద్ధే లక్ష్యంగా..

రాష్ట్రంలో గత కొన్నేళ్ళుగా విత్తన కంపనీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి వివిధ పేర్లతో విత్తనాలను అధిక ధరలకు రైతులకు విక్రయిస్తున్నాయి. ఆ క్రమంలో అక్కడక్కడా నాణ్యత లోపించిన విత్తనాల ఫలితంగా పంట దిగుబడులు తగ్గిపోవటం, తద్వారా రైతులు నష్టపోతున్న సందర్భాలను చూశాం. గత పదేళ్లలో ప్రభుత్వ రంగంలో విత్తన వ్యవస్థ కూడా రైతుల అవసరాలను తీర్చలేకపోవడం, వ్యవసాయ విశ్వవిద్యాలయానికి రైతులకు మధ్య కొంత దూరం పెరగడం, వీటన్నిటి ఫలితంగా పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన విత్తన కంపనీల మోసాలకు గురై రైతులు నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం గ్రామ గ్రామానికి ప్రధాన పంటల నాణ్యమైన మూల విత్తనాన్ని ఎంపిక చేసిన ముగ్గురు లేదా నలుగురు అభ్యుదయ రైతులకు వ్యవసాయ శాఖ సహకారంతో పంపిణీ చేయాలని నిర్ణయించింది. దీని కోసం గత రబీ సీజన్ లో వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల ప్రత్యక్ష పర్యవేక్షణలో వివిధ పరిశోధనా స్థానాల్లో ఈ మూల విత్తన ఉత్పత్తిని చేపట్టి వాటిని శుద్ధి చేసి ఆరు లేదా పది కిలోల ప్యాకెట్ల రూపంలో తయారు చేసి దాదాపు నాలుగువేల విత్తన కిట్లను గ్రామాలలో పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఇప్పుడు అందుబాటులో ఉన్న వనరులతో సుమారు 10250 క్వింటాళ్ల విత్తనాన్ని తయారు చేసి రైతాంగానికి సరఫరా చేయనున్నారు.

మంత్రి పొన్నంను కలిసిన టిజిఆర్ఎస్ ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుయు నాయకులు

సిఎంతో మాట్లాడండి

- ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించండి
- రవాణా మంత్రితో టిజిఎస్‌ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుయు నేతల భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి ఆర్‌టిసి కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు టిజిఎస్ ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌డబ్ల్యుయు) విజ్ఞప్తి చేసింది. ఆదివారం యూనియన్ ప్రధాన కార్యదర్శి కె రాజిరెడ్డి, వైస్ చైర్మన్ డి అబ్రహం, ఉప ప్రధాన కార్యదర్శులు డి గోపాల్, ఎజిఎస్ నగేష్‌పటేల్, జాయింట్ సెక్రటరీ కేటీ రెడ్డి, కల్చరల్ సెక్రటరీ వేణోగోపాల్, ఛాయాదేవి మినిస్టర్స్ క్వార్టర్స్ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిశారు. ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారంపై చర్చించారు. గత సమావేశాల నిర్ణయాలను గుర్తుచేశారు. సిఎంతో మాట్లాడి ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలోని ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రస్తావించారు. ఆర్టీసీ యాజమాన్యం వెల్ఫేర్ కమిటీల సమావేశం నిర్వహించడాన్ని వారు తప్పుపట్టారు. ఇది ఆర్టీసీ కార్మిక వర్గాన్ని, సంఘాలను రెచ్చగొట్టడమేనని మంత్రితో చెప్పారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే పక్రియను పూర్తి చేసి, అపాయింటెడ్ డే ప్రకటించాలని కోరారు. అనంతరం మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారం తమ ప్రాధాన్యతల జాబితాలో ఉన్నదనీ, త్వరలోనే సిఎంతో చర్చించి, కార్మిక సంఘాలన్నింటితో ప్రత్యేకంగా భేటీ అవుతానని చెప్పారు. బిఆర్ఎస్‌ప్రభుత్వ హయాంలో ఆర్‌టిసి కార్మికులను అరిగోస పెట్టారనీ, ఆనాటి సమస్యలను ఇప్పుడు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని వివరించారు.

మీనాక్షి నటరాజన్‌తో సీతక్క భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎఐసిసి రాష్ట్ర వ్యవహారాల రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ కార్యక్రమాలను సీతక్క వివరించారు. పొలిటికల్ అఫైర్స్ కమిటీలో తనకు స్థానం కల్పించినందుకు మీనాక్షి నటరాజన్‌కు సీతక్క ధన్యవాదాలు తెలిపారు.

మీనాక్షి నటరాజన్‌ను సన్మానిస్తున్న సీతక్క

గుండెపోటుతో పారిశుధ్య కార్మికుని మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపా లిటీలో పారిశుధ్య విభాగంలో పని చేస్తున్న కార్మికుడు విజయ్‌కుమార్ ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయ్‌కుమార్‌కు ఆదివారం ఉదయం తీవ్రమైన గుండె నొప్పి రావడంతో వెంటనే అతన్ని స్థానిక కమ్యూనిటీ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరిశీలించి విజయకుమార్ అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. కాగా, మృతుడు విజయ్ కుమార్ అంత్యక్రియల నిమిత్తం మున్సిపల్ అధికారులు రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. మున్సిపల్ కమిషనర్ ఉమా మహేశ్వర్ రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సంధ్య కుమారి, రవీందర్ రెడ్డి, యూనియన్ అధ్యక్షులు మహిపాల్.. స్థానిక ఏరియా ఆస్పత్రికి వచ్చి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు మహిపాల్ మాట్లా డుతూ.. విజయ్ కుమార్ మతి తీరనిలోటని తెలిపారు. జహీరాబాద్ మున్సిపాలిటీ నీటి సరఫరాలో విధులు నిర్వహిస్తున్న విజయ్ కుమార్ నిబద్ధతతో పనిచేస్తూ మంచి పేరు సంపాదించుకున్నారని అన్నారు.

అదంతా కెసిఆర్ కుటుంబ డ్రామా

- ఎమ్మెల్సీ కవిత లేఖపై కాంగ్రెస్ నేత మృత్యుంజయ్ ఎద్దేవా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబం ఒక పెద్దా డ్రామా ఆడుతోందని కాంగ్రెస్ నేత కటకం మృత్యుంజయ్ ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన తండ్రికి లేఖ రాయడం కూడా అందులో భాగమేనని చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కల్వకుంట్ల కుటుంబ పంచాయితీ నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే డ్రామాను మొదలు పెట్టారని విమర్శించారు. దీంతో కేసీఆర్ రాజకీయ జీవితం ఏరో ప్లేన్ మోడ్‌లో పడిందని ఎద్దేవా చేశారు. కవిత రాసిన లేఖను కేసీఆరైనా లీకు చేసి ఉండాలి లేదా ఆమె అయినా చేసి ఉండాలని అనుమానం వ్యక్తం చేశారు. దాన్ని లీకు చేయాల్సిన అవసరం ఇతరులకు ఏముంటుందని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు వచ్చాక 20 లక్షల ఎకరాలకు కాదు...20 వేల ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదని విమర్శిం చారు. డబ్బుల (కాళేశ్వరం) ఎత్తిపోతల పథకంతో వేల కోట్లు దండుకున్నారని విమర్శించారు. దానిపై విచారణ జరుగుతోందనీ, బాధ్యులైన వారంతా జైలుకు పోకతప్పదని ఆయన హెచ్చరించారు.

ప్రజలకు రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు

- మంత్రి డాక్టర్ సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రజలకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) శుభాకాంక్షలు తెలిపారు. స్వరాష్ట్రాన్ని సురాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. స్వరాష్ట్ర సాధన కోసం జరిగిన దీర్ఘకాల ఉద్యమం, అమరవీరుల త్యాగాలను, సోనియమ్మ తెగువను ఆమె గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ప్రజల ఆశయాలను నెరవేర్చే దిశగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రజల బాగోగులు, రాష్ట్ర సమగ్రాభివద్ధే తమ ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. స్వల్ప కాలం లోనే అనేక అభివృద్ధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని గుర్తు చేశారు. తెలంగాణను అభివృద్ధి, సమానత, శాంతి, సౌభ్రాతృత్వాల ప్రతీకగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలని సీతక్క పిలుపునిచ్చారు.

కడదాక కమ్యూనిస్టుగా 'తాయారమ్మ'

- మహిళా సంఘంలో నిబద్ధతతో పనిచేశారు
- ఆమెతో పాటు కుటుంబమంతా పార్టీకి అంకితమై పనిచేయడం అందరికీ ఆదర్శం
- కెఎఎం తాయారమ్మ సంస్మరణ సభలో వక్తలు

తాయారమ్మ సంస్మరణ సభలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సామాన్య మహిళగా ఉంటూ చనిపోయేదాకా కమ్యూనిస్టుగా జీవించిన 'కెఎఎం తాయారమ్మ' అందరికీ ఆదర్శమని వక్తలు మాజీ రాజ్యసభ సభ్యులు, సిపిఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యులు పి మధు, రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ఆదివారం హైదరాబాద్ బాగ్‌లింగపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కెఎఎం తాయారమ్మ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి సిపిఎం ముఖ్యనేతలు, నాయకులు నివాళు లర్పించారు. సిపిఎం జిల్లా నాయకులు వి. కామేష్ బాబు అధ్యక్షతన జరిగిన సభలో మధు మాట్లాడుతూ.. తాయారమ్మ.. కడదాక కమ్యూనిస్టు విలువలు, సిద్ధాంతంతో జీవించారన్నారు. భయానక మైన బ్లడ్ క్యాన్సర్ అవహించినా.. ఆమె ఒక బలమైన నమ్మకం, విశ్వాసం కలిగినటు వంటి కమ్యూనిస్టుగా మరణించారన్నారు. ప్రపంచంలో, దేశంలో కమ్యూనిస్టు ఉద్యమం బాగా దెబ్బతింటోందని, ఈ సందర్భంలో ప్రస్తుత పరిస్థితులను ఆకలింపు, అర్థం చేసుకొని.. తాయారమ్మ ఏ రకంగానైతే తన ఆశయాన్ని సాధించడం కోసం పట్టుదలతో కృషి చేస్తూ వచ్చిందో.. ఆ పట్టుదలను మనమంతా ప్రదర్శిం చాల్సిన అవసరముందన్నారు. అమెరికాలో ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ.. అక్కడి ప్రజలు ఉద్యమిస్తున్నారన్నారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగంలో 2.5లక్షల ఉద్యోగులను తొలగించారనీ, పన్నులు, విద్యా వ్యతిరేక విధానాల పట్ల ప్రజలు పెద్దఎత్తున ఆందోళన చేస్తున్నారన్నారు. మరోవైపు మోడీ సర్కారు పెహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ.. వారి అంతుచూస్తామని ప్రకటిస్తే.. అన్ని వర్గాల ప్రజలు, పార్టీలు మద్దతు ఇచ్చాయని గుర్తుచేశారు. కానీ ఒక్కసారిగా సీజ్ ఫైర్ ప్రకటించడంపై అంతా విస్మయం వ్యక్తం చేశారన్నారు. పెహల్గాం దాడి, అనంతరం పరిణామాలపై పార్లమెంట్ సమావేశాలు పెట్టాలని కోరుతుంటే.. ఆ సభ్యులను విదేశాలు తిప్పుతున్నారని విమర్శించారు. తెలుగు రాష్ట్రాల్లోనూ రాజకీయ పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయనీ, దీనికి అనుగుణంగా మనమంతా నిలబడి ఉద్యమంలో కుటుంబాలతో సహా పాల్గొనటం ద్వారా తాయారమ్మకు సరైన నివాళులర్పించడం అవుతుందన్నారు. పెనన్నర్ల సంఘం జాతీయ నాయకులు ఎంఎన్ రెడ్డి మాట్లాడుతూ.. పోస్టల్ ఉద్యమంలో తాయారమ్మ భర్త ముత్యాలుతో కలిసి దాదాపు ఐదు దశాబ్దాలు పనిచేశానన్నారు. కలిసి పనిచేసే చోట్ల కుటుంబం, పిల్లలు గురించి పట్టించుకోలేదన్నారు. అయినప్పటికీ తాయారమ్మ పార్టీకి, మహిళా ఉద్యమానికి అంకితమై పనిచేయడం ఆదర్శనీయమన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ.. తాయారమ్మ జీవితం చివరి అంకం వరకు కమ్యూనిస్టుగా బతికిందన్నారు. ఆమెతో పాటు కుటుంబమంతా ఉద్యమానికి అంకితమై పనిచేయడం మనందరికీ ఆదర్శమన్నారు. ఈ సమాజంలో మార్పు కోసం ఎవరో ఒకరు పనిచేస్తేనే కష్టమనుకుంటున్న తరుణంలో తన కుటుంబమంతా కమ్యూనిస్టు పార్టీ కోసం పనిచేయడం గొప్ప విషయమన్నారు. తాయారమ్మ మరణించిన తర్వాత మృతదేహాన్ని గాంధీ మెడికల్ కాలేజీకి ఇచ్చి ఆదర్శంగా నిలిచారన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం.. కార్పొరేట్ సంస్థలకు, ఫ్యూడల్ భావాలు, కులవ్యవస్థకు అనుకూలంగా, మతోన్మాద రాజకీయాలు పెంచి పోషిస్తున్నదని తెలిపారు. దేశంలో ఒక్క శాతం కార్పొరేట్ సంస్థల చేతుల్లో 40శాతం సంపద ఉంటే.. 50శాతంగా ఉండే అట్టడుగువర్గాల ప్రజల చేతుల్లో 3శాతమే సంపద ఉందన్నారు. ఆపరేషన్ కాగర్ పేరిట అటవీ సంపదను కార్పొరేట్లకు అప్పగించేందుకు మావోయిస్టులను, అమాయక ఆదివాసీలను చంపుతున్నారని తెలిపారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు టి జ్యోతి మాట్లాడుతూ.. ప్రజా, మహిళా సంఘంలో నిబద్ధతతో తాయారమ్మ పనిచేశారన్నారు. సామాన్య స్త్రీగా భర్తకి చేదోడుగా ఉంటూ ప్రజా సంఘం, పార్టీలో పనిచేసే కార్యకర్తలందరికీ నిరంతరం భోజనాలు, తదితర సౌకర్యాలు కల్పిస్తూ మద్దతుగా నిలిచారని గుర్తుచేశారు. పార్టీ నాయకురాలు హేమలత ప్రోత్సాహంతో ఏపీలోని బందర్‌లో ప్రారంభమైన తాయారమ్మ ప్రజా ప్రస్థానం.. హైదరాబాద్ వచ్చిన తర్వాత కొనసాగించిందన్నారు. చివరికి మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా తన మృతదేహాన్ని గాంధీ మెడికల్ కాలేజీకి డొనేట్ చేయాలని కుటుంబ సభ్యులను కోరటం.. మనందరికీ ఆదర్శమన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య మాట్లాడుతూ.. త్యాగాలకు సమాజం పట్ల సరైన అవగాహనకు నాయకులు కావాల్సిన అవసరం లేదని, ఎవరైనా చేయొచ్చని తాయారమ్మ చేసి చూపించారన్నారు. తాయారమ్మ కుటుంబం మొత్తం ప్రజా ఉద్యమంతో మమేకం కావటం చిన్నవిషయం కాదన్నారు. అనంతరం సిపిఎం రాష్ట్ర నాయకులు డీజీ నరసింహారావు, పార్టీ హైదరాబాద్ జిల్లా మాజీ కార్యదర్శి పిఎస్ఎన్ మూర్తి తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం హైదరాబాద్ జిల్లా మాజీ కార్యదర్శులు ఎం శ్రీనివాస్, ఎస్‌వికె కార్యదర్శి వినయ కుమార్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగలక్ష్మి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం శ్రీనివాస్ రావు, వివిధ రంగాల నాయకులు, కార్యకర్తలు, తాయారమ్మ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి కుమారి ఆశయ సాధనకు

కంకణబద్ధులు కావాలి : బి వెంకట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ములకలపల్లి కుమారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ పిలుపునిచ్చారు. ఆదివారం సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని కొక్కిరేణి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ములకలపల్లి రాములు సతీమణి కుమారి సంస్మరణసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ములకలపల్లి రాములు పార్టీ నాయకునిగా ఎదగడంలో కుమారి సహకారం ఎంతో ఉందన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. మునగాల మండలంలో శత్రువుల భారీ నుంచి పార్టీని, కార్యకర్తలను కాపాడటంలో కుమారి భర్త ములకలపల్లి రాములు ఎంతో కృషి చేశారని చెప్పారు. పార్టీ ప్రజాసంఘాల కార్యక్రమాల్లో కుమారి చురుకుగా పాల్గొనేదన్నారు. మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. పార్టీ బాధ్యతల్లో ఉన్న నాయకులకు కుటుంబ బాధ్యతలు చూసే మహిళలు మరణించడం చాలా బాధాకరమన్నారు. అంతకుముందు కుమారి చిత్రపటానికి పలువురు పార్టీ నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుమారి స్మృతి యార్థం పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన

సంస్మరణ సభలో మాట్లాడుతున్న బి వెంకట్

పాటల సీడీని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆవిష్కరించారు. పార్టీ గ్రామ కార్యదర్శి నందిగామ సైదులు అధ్యక్షతన జరిగిన ఈ సంస్మరణ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బొప్పన పద్మ, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేశ్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ములకలపల్లి రాములు, నాగారపు పాండు, మట్టిపల్లి సైదులు, కోటగోపి, పార్టీ మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు, సీపీఐ జిల్లా నాయకులు దొడ్డా వెంకటయ్య, న్యూడెమోక్రసీ నాయకులు ఒక్కంతుల ప్రభాకర్, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర నాయకులు వస్కుల ముట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జిపై నుంచి లారీ బోల్తా

- డ్రైవర్ మృతి.. క్లీనర్‌కు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ బైపాస్ రోడ్డు ప్రస్తాపూర్ ఓవర్ బ్రిడ్జి వద్ద ఆదివారం ఉదయం లారీ బోల్తా పడడంతో డ్రైవర్ రమేష్ (47) అక్కడికక్కడే మృతి చెందారు. క్లీనర్ వీరేశంకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. వెంచర్లలో ఉపయోగించే పైపుల లోడుతో హైదరాబాద్ నుంచి ముంబై వైపు వెళ్తున్న లారీ పస్తాపూర్ ఓవర్ బ్రిడ్జి వద్దకు రాగానే అదుపుతప్పి బ్రిడ్జిపై నుంచి కిందకు పడింది. దాంతో డ్రైవర్‌కు తీవ్ర గాయలై అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్, క్లీనర్ లారీలో ఇరుక్కుపోవడంతో జేసీబీల సహాయంతో బయటికి తీశారు. కాగా, క్లీనర్ వీరేశంకు తీవ్ర గాయాలు కావడంతో స్థానిక కమ్యూనిటీ వైద్యశాలలో ప్రథమ చికిత్స నిర్వహించి, మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకోవడంతోనే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమిక విచారణకు వచ్చినట్టు ఎస్ఐ తెలిపారు. లారీ యజమాని కడప నుంచి రావాల్సి ఉన్నందున కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు.

డల్లాస్ చేరుకున్న కెటిఆర్

- ఘన స్వాగతం పలికిన ఎన్‌ఆర్ఐలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తన ఇంగ్లాండ్ పర్యటనను ముగించుకుని, ఆదివారం అమెరికాలోని డల్లాస్ చేరుకున్నారు. అక్కడ నిర్వహించనున్న తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఇంగ్లాండ్, అమెరికాలో నిర్వహించబోయే బిఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు, తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొనేందుకు మే 26న హైదరాబాద్ నుంచి బయల్దేరి వెళ్లిన కెటిఆర్.. 27న యూకేకు చేరుకున్నారు. 28న అక్కడి బిఆర్ఎస్ ఎన్ఆర్ఐ కార్యవర్గంతో ఆయన భేటీ అయ్యారు. పార్టీ చేపడుతున్న కార్యక్రమాలతోపాటు భవిష్యత్‌లో చేపట్టబోయే కర్తవ్యాల గురించి చర్చించారు. మలిదశ ఉద్యమకాలంలో తెలంగాణ వాదానికి ప్రతీకగా నిలిచారంటూ ఆయన ఎన్ఆర్ఐ (యుకె)విభాగాన్ని ప్రశంసించారు. అక్కడి తెలుగు బిజినెస్ కౌన్సిల్ ప్రతినిధులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో సమావేశమైన కెటిఆర్, తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే వారికి సహకరించాలని పిలుపునిచ్చారు. 30న 'బ్రిడ్జ్ ఇండియా వీక్-2025' సదస్సులో ప్రధానోపన్యాసం చేసిన ఆయన, ఆర్థిక రంగాన్ని స్థిరమైన వృద్ధితో నడిపించటంలో ప్రపంచానికి తెలంగాణ ఎలా దిక్సూచిగా నిలిచిందో వివరించారు. 31న మెక్‌లారెన్, ఆస్టన్ మార్టిన్, జాగ్వార్, ల్యాండ్ రోవర్ వంటి దిగ్గజ ఆటోమోటివ్ సంస్థలకు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సేవలను అందించే పిడిఎస్ఎల్ సంస్థ నాలెడ్జ్ సెంటర్‌ను (వార్విక్ యూనివర్సిటీలో) కెటిఆర్ ప్రారంభించారు. అనంతరం ఆదివారం ఆయన యూకే నుంచి డల్లాస్‌కు బయల్దేరి వెళ్లారు. అక్కడ ఎన్‌ఆర్ఐలు, బిఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు కెటిఆర్‌కు ఘన స్వాగతం పలికారు.

మౌలిక వసతులను కల్పించడమే నిజమైన సంస్కరణ

- డాక్టర్ సస్పెన్షన్‌పై టిజిజిడిఎ తీవ్ర ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మౌలిక వసతుల లోపాలను పరిష్కరించడం ద్వారానే వాస్తవికమైన సంస్కరణలు మొదలు కావాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టిజిజిడిఎ) సూచించింది. జహీరాబాద్‌లో జరిగిన ఘటన నేపథ్యంలో డాక్టర్లను తక్షణమే సస్పెండ్ చేయడం పట్ల సంఘం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆదివారం సంఘం అధ్యక్షులు డాక్టర్ నరహరి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ లాలు ప్రసాద్ రాథోడ్, కోశాధికారి డాక్టర్ ఎంకె రావుఫ్ ఒక ప్రకటన విడుదల చేశారు.

మౌలిక సదుపాయాల లోపాలను గుర్తించాలని వారు కోరారు. జహీరాబాద్ ఏరియా ఆస్పత్రిలో ఈ ఘటన మధ్యాహ్నం 1:30 గంటలకు విద్యుత్ నిలిపేసిన సమయంలో జరిగిందని తెలిపారు. ఆ సమయంలో మేఘావృత వాతావరణం కారణంగా వెలుతురు తక్కువగా ఉండటంతో వైద్యులు మొబైల్ ఫ్లాష్‌లైట్లు, టార్చ్‌లతో వైద్య సేవలు కొనసాగించడం ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం కాదని వారు అభిప్రాయపడ్డారు. డాక్టర్లపై అన్యాయమైన ఆరోపణలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి దురదృష్టకర సంఘటన తరువాత పూర్తి స్థాయిలో విచారణ లేకుండానే డాక్టర్లను నిందించడం ఒక నిబంధనలా మారిపోయి తీవ్ర అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో తెలుసుకునేందుకు నిరంతర తనిఖీలు, పారదర్శక బాధ్యత వహించే వ్యవస్థలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. టివివిపి కమిషనర్ ఈ కీలక పోస్టులను భర్తీ చేయడంలో విఫలమైన ఫలితంగా న్యాయమైన విచారణలు జరపగల సామర్థ్యం సుదీర్ఘంగా బలహీనమవుతోందని చెప్పారు. కమిషనర్ కార్యాలయ ఒంటెదు పోకడతో సరైన విచారణ లేకుండానే డాక్టర్లను తక్షణ సస్పెన్షన్ చేయడం వంటి చర్యలకు దారితీస్తోందని చెప్పారు. ఈ తరహా వ్యవస్థాత్మక వైఫల్యాల సందర్భాల్లో విచారణలు పూర్తిగా స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా జరిగితే న్యాయం జరిగి, వ్యవస్థపై నమ్మకాన్ని స్థాపించవచ్చని ఉండాలి. అప్పుడే న్యాయం కూడా జరుగుతుందని, వ్యవస్థపై నమ్మకాన్ని కూడా పెంచవచ్చని తెలిపారు. జహీరాబాద్ లాంటి ఘటనలు చోటు చేసుకుంటే స్వతంత్ర విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలోని విస్తృత మౌలిక వసతుల ఆడిట్ చేయాలని కోరారు. న్యాయమైన విచారణ అనంతరమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కరోనా ప్రాణాంతకం కాదు

4 రోజుల్లోనే కోలుకోవచ్చు : డాక్టర్ వసంత్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కోవిడ్-19 ప్రాణాంతకమైన వ్యాధి కాదని ప్రభుత్వ వైద్యులు డాక్టర్ వసంత్ కుమార్ గౌరానీ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సరైనా మందులను సరైన ప్రోటోకాల్ ప్రకారం నాలుగు రోజులు వాడితే ఐదో రోజున నెగెటివ్ వస్తుందని తెలిపారు. దీని కోసం ఆస్పత్రుల్లో చేరాల్సిన అవసరం లేదని తెలిపారు. కరోనా పేరుతో వ్యాపారం చేసుకునేందుకు కార్పొరేట్, ప్రయివేటు రంగాలు కాచుకుని కూర్చున్నాయనీ, వారికి చిక్కొద్దని ప్రజలకు సూచించారు. వందలాది మంది రోగులకు తాను సరైన మందులను, సరైన ప్రోటోకాల్ ప్రకారం ఇచ్చాననీ, వారికి నాలుగు రోజుల్లోనే నయమైనట్టు తెలిపారు. ప్రజలను భయపెట్టడం, వారిని చావు అంచుల్లోకి నెట్టడం కార్పొరేట్ ప్రపంచానికి అలవాటుగా మారిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కోవిడ్-19, డెంగీ తదితర వ్యాధులేవి కూడా ప్రాణాంతకం కాదనీ, అయినప్పటికీ ప్రజలు మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం సరైన చికిత్స సరైన సమయంలో తీసుకోకపోవడమే ఇందుకు కారణమని ఆయన వివరించారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు తాము పాటిస్తున్న ప్రోటోకాల్‌లోని మందులు చాలా చవకగా దొరుకుతాయని, దాదాపు అన్ని మందులు ప్రభుత్వాస్పత్రుల్లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

వాటిని ఉపయోగిస్తే సరిపోతుందని తెలిపారు. తన వద్ద చికిత్స తీసుకున్న రోగులందరూ కోలుకున్నారని వెల్లడించారు. ఇప్పటికే వాటి వివరాలను ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్)కు సమర్పించినట్టు వెల్లడించారు. ప్రభుత్వం చొరవ చూపిస్తే ప్రజల్లో భయాన్ని పూర్తిగా తొలగించవచ్చన్నారు. ఇందుకోసం ప్రభుత్వాలు కోరితే తాను ఉపయోగిస్తున్న మందులు, ప్రోటోకాల్ వివరాలు చెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్టు స్పష్టం చేశారు.

పిసిసి క్రమశిక్షణ కమిటీ అధ్యక్షులుగా మల్లు రవి బాధ్యతలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

టిపిసిసి క్రమశిక్షణ కమిటీ అధ్యక్షులుగా నియమితులైన ఎంపి డాక్టర్ మల్లు రవి బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం ఢిల్లీ నుంచి బయలుదేరి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఆయన ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డి నుంచి క్రమ శిక్షణ కమిటీ అధ్యక్షులుగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమ శాఖను

ప్రత్యేక శాఖగా కొనసాగించాలి

- అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు దశల వారి ఉద్యమం
- 5 నుంచి 30 వరకు గ్రామాల్లో సర్వేలు
- 27న హెలెన్ కెల్లర్ జయంతి ఉత్సవాలు : ఎం అడివయ్య

సమావేశంలో మాట్లాడుతున్న ఎం అడివయ్య

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా కొనసాగించేందుకు, అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు ఇచ్చిన హామీల అమలు కోసం ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని ఎన్‌పిఆర్‌డి ప్రధాన కార్యదర్శి యం.అడివయ్య హెచ్చరించారు. ఆదివారం హైదరాబాద్ చిక్కడపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు కె. వెంకట్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వికలాంగుల సమస్యలపై జూన్ 5 నుంచి 30 వరకు గ్రామాల్లో సర్వేలు నిర్వహిస్తుమని తెలిపారు. సర్వేలో గుర్తించిన సమస్యలపై దశల వారీగా ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు. రచయిత, కవి, బధిరుల ఆశాజ్యోతి హెలెన్ కెల్లర్ 145వ జయంతి సందర్భంగా జూన్ 27న రాష్ట్ర స్థాయి సాంస్కృతిక ఉత్సవాలు నిర్భహించనున్నట్టు తెలిపారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్య మాట్లాడుతూ కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన 11 ఏళ్ల కాలంలో వికలాంగులను అన్ని రంగాల్లో మోసం చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వికలాంగుల చట్టాల అమలు పర్యవేక్షణలో నిర్లక్ష్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేషనల్ ట్రస్ట్, నేషనల్ పాలసీ, 2016 ఆర్పీడీ చట్టాలను నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నలను అడ్డుకుంటామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ కోసం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేట్‌పరం చేసి వికలాంగుల రిజర్వేషన్లను ఎత్తివేయాలని కేంద్రం కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు.

గత ప్రభుత్వం మహిళా శిశుసంక్షేమ శాఖ నుంచి వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా కొనసాగించాలని జీవో విడుదల చేసిందనీ, డాన్ని ఎందుకు అమలు చెయడం లేదని ప్రశ్నించారు. ప్రతి జిల్లాలో వికలాంగుల సంక్షేమ శాఖ నిర్వహణ కోసం అవసరమైన సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. పెన్షన్ రూ.6,000లకు పెంచకుండా వికలాంగులను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తుందని విమర్శించారు. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న ప్రభుత్వం వికలాంగులకు ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నించారు. సామూహిక ప్రాంతాలను అవరోధ రహితంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం చేసిన రాష్ట్రంలో అమలు కావడం లేదని తప్పుపట్టారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి వికలాంగుల సమాఖ్యలను పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర గౌరవాధ్యక్షులు టి.వరమ్మ, కోశాధికారి ఆర్.వెంకటేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాశప్ప, యశోద, అరిఫా, మధుబాబు, సహాయ కార్యదర్శులు రాజు, గంగాధర్, లింగన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు భుజంగారెడ్డి, నగేష్, రాములు, భాగ్యలక్ష్మి, నర్సిములు, రాధమ్మ, యాదయ్య, కవిత, మల్లేష్, ప్రియాంక, మేరీ, అనసూజా, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యానికి బాటలు

- రూ.12 వేల కోట్లతో గ్రామీణ రోడ్ల ఆధునీకరణ ప్రారంభం
- 93వేల గ్రామీణ సిబ్బందికి గ్రీన్‌చానల్ ద్వారా వేతనాలు
- పంచాయతీరాజ్ శాఖపై మంత్రి సీతక్క తనదైన ముద్ర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముందుకెళ్తుంది. అభివృద్ధిలో మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) తనదైన ముద్ర వేస్తున్నది. గ్రామీణ స్థాయిలో స్వచ్ఛత, పచ్చదనం, ఉపాధి, మహిళా సాధికారత, మౌలిక వసతుల కల్పన, అధికార వికేంద్రీకరణ వంటి అంశాల్లో తెలంగాణ సర్కారు ముందడుగు వేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛదనం, పచ్చదనానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. మిషన్ భగీరథ పథకం పరిధిలో తాగునీటి సమస్యల పరిష్కారానికి కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఈ ఏడాది 63,000 పైగా పంపులు, మోటార్లను మరమ్మతు చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. తాగునీటి సరఫరాలో వృథాను అరికట్టేందుకు మంచినీటి సహాయకుల ద్వారా నియంత్రిత నీటి సరఫరా అందిస్తోంది. వెయ్యి కోట్ల రూపాయలతో తాగునీటి స్థిరీకరణకు ప్రణాళికలు రూపొందించింది. మిషన్ భగీరథ, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగాన్ని బలోపేతం చేసేలా ఎప్పటికప్పుడు ఏఈల భర్తీ చేస్తున్నది. ఇప్పటికే వెయ్యి ఏఈ పోస్టులను భర్తీ చేసిన విషయం విదితమే. పదేండ్ల కాలంలో బిఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిన గ్రామీణ రోడ్ల మరమ్మతులు, నూతన రహదారుల ఏర్పాటు కోసం రూ.12 వేల కోట్లతో కొత్తగా హామ్ విధానం తీసుకొచ్చింది. దేశ చరిత్రలో మొట్టమొదటిసారిగా ఉపాధి హామీ కార్మికులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ.12 వేల ఆర్థిక చేయూత పథకాన్ని ప్రారంభించింది. 93,000 గ్రామీణ సిబ్బందికి గ్రీన్ చానెల్ ద్వారా నెలనెలా వేతనాల చెల్లింపు చేసే పద్ధతిని ఈ నెల నుంచే మొదలు పెట్టింది. పంచాయతీ రాజ్ వ్యవస్థలో 900 వరకు కారుణ్య నియామకాలు చేపట్టింది.

మహిళా సాధికారతకు పెద్ద పీట

మహిళా సంఘాల ద్వారా 20 రకాల వ్యాపారాలను విజయవంతంగా నడుపుతున్నది. ప్రతి ఏటా మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా రూ.25 వేల కోట్ల రుణాలు ఇప్పిస్తున్నది. మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు, ఆర్‌టిసి బస్సులు, సోలార్ విద్యుత్ ప్లాంట్లను నిర్వహిస్తోంది. కొందరికి మొబైల్ ఫిష్ ట్రక్కులు అందజేసింది. త్వరలోనే మహిళా సంఘాలకు రైస్ మిలుల్లు, గోదాముల నిర్వహణ బాధ్యత అప్పగించనుంది. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలిస్తుంది. ప్రభుత్వ మద్దతుతో మహిళా సంఘాలు 2.25 లక్షల ఎంఎస్ఎంఇలను స్థాపించాయి. మహిళా సంఘాల గ్రూపు సభ్యులకు రూ. పది లక్షల ప్రమాదబీమా, రూ. రెండు లక్షల లోన్ బీమా సౌకర్యాన్ని కల్పించింది. మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువులను అమ్ముకునేకుందుకు హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్‌లో ఇందిరా మహిళా శక్తి బజార్‌ను రూ. తొమ్మిది కోట్లతో నిర్మించింది. స్కూల్ యూనిఫాం కుట్టుపనుల్లో మహిళా సంఘాల భాగస్వామ్యాన్ని పెంచింది. రూ. 110 కోట్లతో 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణాలను చేపడుతున్నది. 214 ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయించి ప్రజలకు రుచికరమైన ఆహారం అందిస్తున్నది. పల్లె ప్రజలకు పట్టం కట్టేలా, మహిళల సాధికారతకు మార్గం చూపేలా మంత్రి సీతక్క నేతృత్వంలోని గ్రామీణాభివృద్ధి శాఖ ముందడుగు వేస్తోంది.